ఆర్భాటానికే ఆత్మీయ సమావేశాలు?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా వ్యవస్థను నాశనం చేసింది. సంస్కరణల పేరుతో తీసుకున్న పలు నిర్ణయాలు గందరగోళానికి తెరతీశాయి. విలీనం పేరుతో అనేక ప్రాథమిక పాఠశాలల విద్యార్థులను పొరుగూరి బడులకు విలీనం చేశారు. తల్లిదండ్రులు నిరసనలు తెలుపుతున్నారు. బదిలీ అయిన చాలామంది టీచర్లు ఇంకా విధుల్లోకి చేరలేదు. ట్రాన్స్‌ఫర్‌లు వచ్చిన టీచర్లు రిలీవర్లు రాక తూతూమంత్రంగా బడులకు వస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే రాజకీయ ఉద్దేశంతో నాడు–నేడు పనులను అర్ధాంతరంగా ఆపేయడం తదితర కారణాల వల్ల ప్రభుత్వంపై తీవ్రమైన వ్యతిరేకత నెలకొంది. ఈ తరుణంలో తల్లిదండ్రుల సమావేశాలను నిర్వహించి అసలు సమస్యను తెరమరుగు చేసేందుకు ఆత్మీయ సమావేశాలు నిర్వహించారనే విమర్శలు వినిపిస్తున్నాయి.


తల్లిపాదాలకు వందనం చేస్తున్న వారి పిల్లలు

- ప్రభుత్వ బడుల్లో నెలకొన్న సమస్యలు
- వెక్కిరిస్తున్న నాడు–నేడు పెండింగ్ పనులు
- పాఠశాలల విలీనంతో గందరగోళం
- టీచర్ల బదిలీలతో మరిన్ని కష్టాలు
- వీటిని మరిపించేందుకే తల్లిదండ్రుల సమావేశాలు


పలమనేరు మండలంలోని గజ్జలవారిపల్లి ప్రైమరీ స్కూల్‌లో ఇదీ పరిస్థితి

పలమనేరు: పలమనేరు రెవిన్యూ డివిజన్‌లోని పలమనేరు, కుప్పం, పుంగనూరు నియోజకవర్గాల్లో ప్రభుత్వ పాఠశాలలు వున్నాయి. మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 700 మంది టీచర్లు విధుల్లో చేరాల్సి ఉంది. సింగిల్ టీచర్స్ ఉన్న బడుల్లో కొత్త టీచర్లు విధుల్లోకి చేరేదాకా వీరికి బదిలీలు లేకుండా పోయాయి.

పక్క గ్రామాలకు పిల్లల్ని పంపమంటున్న తల్లిదండ్రులు

ఈ ఏడాది విద్యా సంస్కరణలో పేరుతో కొన్ని పాఠశాలలను విలీనం చేశారు. ఆయా గ్రామాల్లోని బడులను పొరుగు గ్రామాల్లోని ఎక్కువ పిల్లలున్న చోట్లకు మార్చి వాటిని మోడల్ ప్రైమరీ స్కూల్స్‌గా నామకరణం చేశారు. ఇందులోనూ విలీనం చేసిన బడుల్లోని 3, 4, 5 తరగతుల పిల్లలను మాత్రమే చేర్చుకోవాలని మెలిక పెట్టింది. మిగిలిన 1, 2 తరగతులను ఫౌండేషన్ స్కూళ్లుగా మార్చి వీటిల్లోకి అంగన్‌వాడీ సెంటర్లను కలపనున్నట్టు సమాచారం . దీంతో పిల్లల తల్లిదండ్రులకు ఆందోళన తప్పడం లేదు. అనేక మండలాల్లో రెండు, మూడు కిలోమీటర్లలోని పక్క గ్రామానికి వెళ్లేందుకు రవాణా సౌకర్యాలు లేకపోవడంతో పిల్లలను ఎలా పంపాలని తల్లిదండ్రులు నిలదీస్తున్నారు.

ఏడొందల మంది విధుల్లో చేరేదెప్పుడు...

పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని పలమనేరు, కుప్పం, పుంగనూరు నియోజకవర్గాల్లో 700 మంది టీచర్లు బదిలీ అయ్యారు. వారి స్థానంలో రిలీవ్ అయినవారు, కొత్తగా డీఎస్సీలో ఎంపికైన వారు చేరాల్సి వుంది. వారు వచ్చేదాకా సింగిల్ టీచర్లే దిక్కు. బైరెడ్డిపల్లి మండలంలో 129 మంది బదిలీకాగా 49 మంది వరకు బదిలీపై రావాల్సి ఉంది. దీంతో 90 వరకు వేకన్సీలున్నాయి. ఇదే పరిస్థితి అన్ని మండలాల్లోనూ ఉంది.

అడ్మిషన్లు పెంచుకుంటున్న ప్రైవేటు స్కూళ్లు


గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను విలీనం పేరుతో పక్క గ్రామాల్లోని పాఠశాలల్లో కలపడం పిల్లలకు ఇబ్బందులను తెచ్చిపెట్టింది. పిల్లలను కిలోమీటర్ల దూరంలోని పాఠశాలలకు పంపేందుకు ఇష్టపడని తల్లిదండ్రులు ప్రైవేట్ బడుల్లో చేర్పించడానికి మొగ్గు చూపుతున్నారు. తగిన ఆర్థిక స్థోమతలేని వారు బడికి పంపకుండా మధ్యలోనే చదువు మాన్పిస్తున్నారు. ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు ఆయా గ్రామాలకు వెళ్లి ఇంటి వద్దకే బస్సు నడుపుతామని చెప్పి పిల్లలను చేర్చుకుంటున్నారు. ప్రైవేటు బడిలో ఉన్నా తల్లికి వందనం పథకం వస్తుందని, ఫీజు కింద ఆ నగదు చెల్లిస్తే సరిపోతుందని చెబుతున్నారు. ఫలితంగా ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పూర్తిగా తగ్గిపోతోంది. వీటన్నింటినీ మరిపించేందుకే తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించి పిల్లలతో తల్లిదండ్రుల పాదాలను మొక్కించడం, అమ్మపేరిట మొక్కలు నాటించడం లాంటి పనులు చేయిస్తూ తల్లిదండ్రులను శాంతింపజేయాలని ప్రభుత్వ పెద్దలు చూస్తున్నారని మేధావులు విమర్శిస్తున్నారు.

క్లుప్తంగా

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

సదుం: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ఆదివారం శ్రీవెంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. అవసరమైన వారిని ఉచిత ఆపరేషన్లకు ఎంపిక చేస్తామని తెలిపారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెరువులో విరబూసిన తామర పూలు


ఎగువ చెరువులో వికసించిన తామర పుష్పాలు

చౌడేపల్లె: మండలంలోని దుర్గసముద్రం పంచాయతీ గాండ్లపల్లె సమీపంలోని అంకాలమ్మ ఆలయం వద్దనున్న ఎగువ చెరువులో ఎర్ర తామర పూలు వికసించాయి. వాటిని చూసి స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతి ప్రేమికులు పూలను తమ సెల్ ఫోన్లలో ఫొటోలు తీసుకుని మురిసిపోతున్నారు. కొందరు భక్తులు వాటితో అంకాలమ్మకు పూజ చేస్తున్నారు.

మిగిలిన సీట్లలో ప్రవేశానికి దరఖాస్తులు

కుప్పం: మహాత్మా జ్యోతిబాపూలే వెనుక బడిన తరగతుల సంక్షేమ బాలురు గురుకుల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి 5, 6, 8వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సరోజ తెలిపారు. ఈ నెల 18వ తేదీ వరకు దరఖాస్తులు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ నెల 20వ తేదీన గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష వుంటుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి 18వ తేదీ హాల్ టికెట్లు అందజేస్తామని వెల్లడించారు. వివరాలకు 7680845898లో సంప్రదించాలని కోరారు.

ఉచిత కంటి వైద్యశిబిరం రేపు

బంగారుపాళెం: మండల కేంద్రం బంగారుపాళెంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు మురళీకృష్ణ శనివారం తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కంటి జబ్బు రోగులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి చెన్నై శంకర్ నేత్రాలయ ఆస్పత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని కంటి జబ్బు రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

క్షేత్రస్థాయిలో తిరిగితే సమస్యలు తెలుస్తాయి


మిట్టూరు సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో డైరెక్టర్ గురవయ్య

చిత్తూరు కార్పొరేషన్: క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది ఎక్కువగా తిరగాలని ట్రాన్స్‌కో డైరెక్టర్ గురవయ్య ఆదేశించారు. శనివారం మిట్టూరు సబ్‌స్టేషన్‌ను పరిశీలించి మాట్లాడారు. నిత్యం క్షేత్రస్థాయిలో తిరుగుతుంటే సమస్యలు తెలుస్తాయన్నారు. ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందిస్తుంటే సమస్యలు తగ్గుతాయన్నారు. అంతరాయాలు పెరుగుతున్నాయని వాటిని నివారణకు కృషి చేయాలన్నారు. విధిగా నిర్వహణ పనులు చేస్తుంటే సమస్యలు రావన్నారు. ట్రీకటింగ్, లైన్, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు పనులు సకాలంలో పూర్తి చేస్తే అంతరాయాలు ఉండవన్నారు. వినియోగదారులతో స్నేహపూర్వకంగా నడుచుకోవాలన్నారు. విద్యుత్ బిల్లులు వందశాతం వసూళ్లకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, ఈఈలు మునిచంద్ర, డీఈలు ప్రసాద్, ఆనంద్, ఏఈ రాజేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

తిరుచ్చిపై వెంకన్న విహారం

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం బంగారు తిరుచ్చి వాహనంపై విహరించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా వేకువజామునే శ్రీవారికి నిత్య కైంకర్యాలు సమర్పించారు. ఉత్సవర్లకు కల్యాణోత్సవం జరిపించారు. సాయంత్రం వేడుకగా ఊంజల్‌సేవ చేపట్టారు. అనంతరం దేవదేవేరులను తిరుచ్చిపై కొలువుదీర్చి ఊరేగించారు.

రాజనాలబండలో విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

చౌడేపల్లె: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలో వెలసిన ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు చేశారు. అర్చకులు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో స్వామివారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వివిధ చోరీల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న అనుమానితులు రాజనాలబండకు చేరుకున్నారు. అర్చకులు వారితో ఆలయ సంప్రదాయం ప్రకారం ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా రాజనాలబండ భక్తులతో సందడి నెలకొంది. అలాగే దుర్గసముద్రం పంచాయతీ గాండ్లపల్లెలోవున్న ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు ఆనందాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆంజనేయస్వామి మాలాధారణ ధరించిన భక్తులు శ్రీరామ, హనుమాన్ నామస్మరణాలతో గీతాలాపన చేశారు. అనంతరం అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్‌పై విరిగి పడిన చెట్టుకొమ్మ


పుంగనూరులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై విరిగిపడిన చెట్టు కొమ్మ

పుంగనూరు(చౌడేపల్లె): పుంగనూరు పట్టణంలోని ముడెప్ప సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై శనివారం చెట్టు కొమ్మ విరిగిపడింది. ఆ సమయంలో అక్కడ జన సంచారం లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. పట్టణంలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. స్థానికులు అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఎల్ఐ కుమార్ అక్కడకి చేరుకుని మరమ్మతులు చేపట్టారు. ఇక్కడ నిత్యం రద్దీగా ఉంటుందని, ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే పాఠశాల కూడా ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని విద్యుత్‌శాఖాధికారులు దృష్టిలో వుంచుకుని రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

యూనివర్సిటీ హామీ ఎప్పుడు నెరవేరుస్తారు ?

చిత్తూరు కలెక్టరేట్: కూటమి ప్రభుత్వం చిత్తూరు జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ ఏర్పాటు హామీ ఎప్పుడు నెరవేరుస్తుందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్, నియోజకవర్గ కోఆర్డినేటర్ టిక్కి రాయల్ ప్రశ్నించారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలో ఆ పార్టీ నాయకులు నియోజకవర్గ స్థాయి సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి నాయకులు చిత్తూరులో యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని గొప్పలు చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా ఇంతవరకు ఆ హామీ నెరవేర్చకపోవడం దారుణమని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వెంటనే గత సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇందులో ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ రాంభూపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు లోకేష్, ప్రధాన కార్యదర్శి సెల్వం, బీసీ సెల్ అధ్యక్షులు దొరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ అడ్మిషన్లకు నోటిఫికేషన్ ఇంకెప్పుడు ?

చిత్తూరు కలెక్టరేట్: కూటమి ప్రభుత్వం డిగ్రీ అడ్మిషన్లకు నోటిఫికేషన్ ఇంకెప్పుడిస్తుందంటూ ఎస్ఎఫ్ఐ నాయకులు బాలసుబ్రహ్మణ్యం, దాములు ప్రశ్నించారు. ఈ మేరకు వారు శనివారం విలేకరులతో మాట్లాడారు. విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టకపోవడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో ఉన్నత విద్య నిర్వీర్యం అవుతోందని విమర్శించారు. చిత్తూరు, పలమనేరు, కుప్పం మండలాల్లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అనేక విమర్శలు చేశారన్నారు. ప్రస్తుత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వింత పోకడలు అమలు చేయడం సబబు కాదన్నారు. సింగిల్ మేజర్ సబ్జెక్ట్ విధానాన్ని వెంటనే తొలగించాలన్నారు. డబుల్ మేజర్ సబ్జెక్ట్స్ విధానం తీసుకొస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం కొద్ది రోజులకే మాట మార్చి తిరిగి సింగిల్ సబ్జెక్ట్ విధానం అమలు చేయడం దారుణమన్నారు. డిగ్రీ అడ్మిషన్లు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ అనే అంశంపై వెంటనే తెలియజేయాలన్నారు. ఉన్నత విద్య పట్ల గందరగోళంగా వ్యవహరించడం సరికాదని విమర్శించారు. ఇంటర్ పూర్తయి నాలుగు నెలలు గడుస్తున్నా డిగ్రీ అడ్మిషన్లు జరగకపోవడం అన్యాయమన్నారు. పొరుగు రాష్ట్రమైన తెలంగాణలో నెల క్రితమే డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

నేడు బాబు షూరిటీ మోసం గ్యారెంటీ

- బైసాని ఫంక్షన్ హాల్‌లో ఏర్పాట్ల పరిశీలన
- నాయకులతో మాజీ మంత్రి పెద్దిరెడ్డి సమావేశం
- కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ధ్యేయం


ఏర్పాట్లు పరిశీలిస్తున్న నాగ భూషణరెడ్డి, కిషోర్‌బాబు, సుధాకర్‌రెడ్డి తదితరులు

చౌడేపల్లె: మండల కేంద్రమైన చౌడేపల్లెలోని గడ్డంవారిపల్లె రోడ్‌లో వున్న బైసాని ఫంక్షన్ హాల్‌లో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు బాబు షూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నాగభూషణరెడ్డి తెలిపారు. ఇందులో మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొననున్నట్టు తెలిపారు. ఆయన శనివారం వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ, పార్టీ రాజంపేట సెగ్మెంట్ యూత్ అధ్యక్షుడు మిద్దింటి కిషోర్‌బాబుతో కలిసి సమావేశపు ఏర్పాట్లను పరిశీలించారు. వారు మాట్లాడుతూ మండలంలోని 19 గ్రామ పంచాయతీల నుంచి సుమారు వెయ్యి మందికి పైగా నాయకులు, కార్యకర్తలు హాజరయ్యే అవకాశం ఉందని, ఈ మేరకు ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి చైతన్యవంతులను చేసే దిశగా ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. ప్రజాప్రతినిధులు, అనుబంధ కమిటీ సభ్యులు, పార్టీ నేతలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూత్ కార్యదర్శి కళ్యాణ్‌భరత్, పవన్‌కుమార్, మంజునాథ్, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సోమల మండలంలోని కందూరు రోడ్డులోవున్న షావలి మామిడి కాయల మండీలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ కన్వీనర్ గంగాధర్‌రాయల్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, పార్టీనేతలు విధిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పుంగనూరులో

పుంగనూరు(చౌడేపల్లె): పుంగనూరులో ఆదివారం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. ఉదయం 9.30 గంటలకు జేఎండీ కల్యాణ మండపంలోనూ, అలాగే పుంగనూరు రూరల్ మండలంలోని ఆర్ఆర్ కల్యాణ మండపంలో 10.30 గంటలకు కార్యక్రమం వుంటుందని పేర్కొన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు ఇర్ఫాన్, పార్టీ మండల అధ్యక్షుడు అమరనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

15న గుడివంక ఆలయ అంగళ్లు గేటు వేలం

గుడుపల్లె: గుడివంక శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా అంగళ్ల గేటు వసూలుకు ఈ నెల 15వ తేదీన వేలం పాటలు నిర్వహించనున్నట్టు ఈవో కమలాకరన్ తెలిపారు. ఆగస్టు నెల 11 నుంచి16 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈ క్రమంలో అంగళ్ల గేటు, లడ్డు ప్రసాదం విక్రయం, తలనీలాలు పోగుచేసుకునే హక్కును పొందడానికి వేలం పాట నిర్వహిస్తామన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.10 వేల డిపాజిట్ చెల్లించాలని సూచించారు.

వాటర్ ప్లాంట్‌లో పురుగుల నీరు


బిందెలోని నీటిలో వున్న పురుగులు

చౌడేపల్లె: ప్రజలకు శుద్ధి చేసిన నీటిని అందజేయాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుచేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్లాంట్ నిర్వహణ గురించి పట్టించుకోలేదు. దీంతో నీటిని పట్టుకుని వెళ్లిన ప్రజలకు చేదు అనుభవం ఎదురైంది. నీటిని క్యాన్లు, బిందెల్లో తీసుకుని ఇంటికెళ్లి చూడగా మలినాలతో కూడిన పురుగులను గుర్తించారు. తాగునీటి కలుషితం కారణంగా అనారోగ్యానికి గురవుతున్నామని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడు లేడని వాపోతున్నారు. అధికారులు స్పందించి శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వేణుగోపాల స్వామికి ప్రత్యేక పూజలు


భజన చేస్తున్న భక్తులు

వి.కోట: పట్టణంలోవున్న రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి శనివారం అఖండ భజన కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆలయ ప్రాగంణం స్వామి వారి భజనలతో మారుమోగింది. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త సీతారామయ్య మాట్లాడుతూ దాదాపు 10 సంవత్సరాలుగా ప్రతి శనివారం భక్తులతో అఖండ హరినామస్మరణతో భజన, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందుకు పట్టణ ప్రముఖులు, భక్తులు, దాతలు చందాల రూపంలో ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్టు తెలిపారు.

బోయకొండలో రెచ్చిపోతున్న దళారులు

- ఆషాఢ మాసంలో పెరిగిన భక్తుల రద్దీ
- లోకల్ పేరుతో దర్శనంలో దళారుల చేతివాటం
- అధిక ధరలు వసూలు చేస్తున్న ప్రయివేటు వ్యక్తులు
- రూ.2 వేల నుంచి రూ.3 వేలు పలుకుతున్న ఖాళీ స్థలాలు
- చోద్యం చూస్తున్న అధికారులు


ఆలయం వద్ద నిలిచిపోయిన వాహనాలు

బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆషాఢ మాసంలో ప్రత్యేక పూజలు జరుగుతాయి. ఈ క్రమంలో కర్ణాటక భక్తులు ప్రతి ఏటా పెద్ద సంఖ్యలో బోయకొండకు తరలివస్తుంటారు. ఈ యేడాది ఆషాఢ మాసం 15 రోజులు పూర్తయ్యాయి. ఈ ఆదివారం కీలకమైనది. అందులోనూ ఆడి కృత్తిక కావడంతో కర్ణాటక భక్తులు ప్రత్యేకంగా భావిస్తారు. దీంతో భక్తుల రద్దీ ఎక్కువగా వుంటుంది. దీన్ని అనుకూలంగా మార్చుకున్న దళారులు చేతివాటం చూపి భక్తులను నిలువునా దోచుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించడం పలు విమర్శలకు తావిస్తోంది.

చౌడేపల్లె: చిత్తూరు జిల్లాలో బోయకొండ గంగమ్మ ఆలయం ప్రముఖ పుణ్యక్షేత్రంగా విలసిల్లుతోంది. ఇక్కడ అమ్మవారిని దర్శించుకుని ఏదైనా కోరిక కోరితే నెరవేరుతుందని భక్తుల నమ్మకం. ఈ క్రమంలో ప్రతి మంగళ, శుక్ర, ఆదివారాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు. ముఖ్యంగా ఆషాఢ మాసంలో కర్ణాటక నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో రావడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో కొండపై కొంతమంది దళారులు తిష్టవేశారు. భక్తుల రద్దీని అదునుగా చేసుకుని చేతివాటం చూపుతున్నారు. గదుల అద్దెలను అమాంతం పెంచి దొరికినకాడికి దోచుకుంటున్నారు. ఆలయ గదుల అద్దె రూ.1000 ఉండగా ముందుగానే రిజర్వు అయ్యాయి. ప్రయివేటు గదులున్న వారు ఇష్టానుసారంగా రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు అద్దె వసూలు చేస్తున్నారు. పరిసర ప్రాంతాల్లోని మామిడి చెట్లు, ఖాళీ ప్రదేశాలు, కానుగ చెట్ల వద్ద భక్తులు వంట చేసుకుని ప్రశాంతంగా గడపడానికి రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు వసూలు చేస్తున్నారు.

లోకల్ పేరిట దర్శనాల్లో దందా

కొంతమంది దళారులు లోకల్ భక్తుల పేరుతో ఇతర ప్రాంతాల వారికి దర్శనాలు చేయిస్తూ ఆలయ ఆదాయానికి గండి కొడుతున్నారు. లోకల్‌గా ఉండే కొందరు అద్దె రూములు ఏర్పాటుచేసుకున్నారు. వారి గదులను కర్ణాటక భక్తులకు ఇస్తూ యథేచ్ఛగా దర్శనాలు చేయించి సొమ్ము చేసుకుంటున్నారు. వారి వద్ద అద్దెతో పాటు దర్శనాల సేవల పేరిట పెద్ద మొత్తంలో డబ్బు గుంజుతున్నారు.

నియంత్రణలేని ట్రాఫిక్

ఆషాఢ మాసంలో బోయకొండ గంగమ్మ చెంతకు ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు వాహనాల్లో వస్తుంటారు. రద్దీ దృష్ట్యా వాహనాలు ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేస్తున్నారు. ఆలయం వద్దకు కూడా వెళ్తున్నారు. పోలీసులు తగిన చర్యలు తీసుకోకపోవడంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. రణభేరి గంగమ్మ ఆలయం నుంచి ప్రధాన బోయకొండ ఆలయం వద్దకు రోడ్డు ఏటవాలుగా ఉంది. కాస్త ఆదమరిస్తే వాహనం వెనక్కి వచ్చి వాహనాన్ని ఢీకొనే ప్రమాదం వుంది. అదే విధంగా జేబు దొంగలు విజృంభిస్తున్నారు. హిజ్రాలు భక్తులపై దాడిచేస్తున్నారు.పోలీసులు వాహనాలను నియంత్రించి ప్రమాదాలు జరగకుండా చూడాలని, హిజ్రాలు దాడి చేయకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు.



భవనం బయట వంటచేసుకుని తింటున్న భక్తులు(ఫైల్), ఏటవాలుగా ఉన్న రోడ్డుపై నిలిచిపోయిన కార్లు

వైభవం.. శ్రీరాముడి రథోత్సవం..


భక్తజనసందోహసం నడుమ సాగుతున్న శ్రీరాముడి రథోత్సవం

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు కోదండరాముల దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీరాముడి రథోత్సవం భక్తజనసందోహం నడుమ అంగరంగ వైభవంగా సాగింది. స్వామివారి రథాన్ని లాగడానికి భక్తులు పోటీపడ్డారు. ఉదయం సీతారామలక్ష్మణులకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఉభయదారులతో స్వామికి తిరుమంజనం, పాలాభిషేకం, తోమాల సేవ, మధ్యాహ్నం ఊంజల్ సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

రామనామస్మరణతో రథోత్సవం

కోదండరామాలయంలో శనివారం సాయంత్రం శ్రీరాముడి రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సిద్దేశ్వరరెడ్డి నేతృత్వంలో కార్యనిర్వాహకులు, గ్రామస్తుల సహకారంతో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉభయదారులు స్వామివారికి గజమాలలు, పూజాసామగ్రి, ప్రసాదాలు మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు.